క్లుప్తంగా

ఇంటింటి కసువు సేకరణ పరిశీలన



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. ఈ సందర్భంగా సుందరాచార్యుల వీధి మోటులో ఉన్న చెత్తపాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. వసంతపేట, నేతాజీ నగర్–1, 2, రామేశ్వరంలోని ఆణా బంకు పరిసర ప్రాంతాల్లో కాలువల్లోని పూడికల తొలగింపు, ఇంటింటి చెత్త సేకరణను కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా, మలేరియా మేస్త్రి ఐజయ్య పాల్గొన్నారు.

అన్నదానం



విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో అంబాసిడర్స్ ఆఫ్ క్రైస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో సోమవారం అంబాసిడర్స్ ఆఫ్ క్రైస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలలో భాగంగా అన్నాదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వృద్ధులకు కమిటీ పెద్దలు స్వయంగా భోజనం వడ్డించారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నక్కోళ్ల బాలు, వైస్ ప్రెసిడెంట్ వినయ్, సెక్రటరీ పీటీ శామ్యూల్, జాయింట్ సెక్రటరీ స్వరూప్, మెంబర్స్ బందెల స్వామి దాస్, సునీల్, ప్రసాద్, డేవిడ్ పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో..

చాపాడు: మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో భద్రకాళీ మాత సమేత వీరభద్ర స్వామి అన్నసత్రంలో సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు మండలంలోని నెర్రవాడకు చెందిన మాజీ జెడ్పీటీసీ, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈఓ మారుతి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెరుగు నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయ శర్మకు నివాళి



లక్కోజు సంజీవరాయశర్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయ శర్మ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు మాట్లాడుతూ సంజీవరాయశర్మ గణితంలో అవధానాలు చేశారని, ఆయనకు లభించిన పురస్కారాలను విద్యార్థులకు వివరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని గణితంలో మంచి పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయమోహన్‌రెడ్డి, ఖాజాపీర్, తిరుపేలయ్య, చాంద్‌బాషా, అల్లాబకాష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎం.ప్రభాకర్‌కు జాతీయ పురస్కారం



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన రచయిత, పరిశోధకుడు డాక్టర్ ఎం.ప్రభాకర్ రచనా రంగంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో టూరిజం ప్లాజాలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రభాకర్ జననం–జీవనం–మరణం, అయోధ్య, కాశీ రహస్యం, తృతీయ ప్రకృతి తదితర 20 పుస్తకాలు రచించారు. ఈయనకు పురస్కారం రావడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రభాకర్ రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌కు ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

కలసపాడు : మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన మంగమ్మ (72) కాశినాయన మండలంలోని ఓబుళాపురం వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమంలో ఆశ్రయం పొందుతోంది. అనారోగ్యంతో సోమవారం మంగమ్మ మృతి చెందడంతో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తమ సంస్థ ప్రతినిధులతో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

వంతెన.. ప్రమాదం అంచున

- దెబ్బతిన్న పిల్లర్లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు



దెబ్బతిన్న సగిలేరు బ్రిడ్జి పిల్లర్లు

కలసపాడు : పోరుమామిళ్ల – గిద్దలూరు ప్రధాన రహదారి కలసపాడు సమీపంలోని సగిలేరు నదిపై ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన అధ్వాన్న స్థితిలో ఉంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తోందనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఐదు దశాబ్దాల క్రితం రాతిపిల్లర్లతో వంతెన నిర్మించారు. 1996 సంవత్సరంలో సగిలేరుకు వరద పోటెత్తడంతో వంతెన కింది భాగంలోని రెండు రాతిపిల్లర్లు కొట్టుకుపోయాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ రాతిపిల్లర్ల స్థానంలో నామమాత్రంగా పిల్లర్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప.. పటిష్ట చర్యలు చేపట్టలేదు. ఆ వరదలలో సుమారు 10 అడుగుల మేర వరదనీరు పొంగి ప్రవహించింది. అంతేకాకుండా 2020 సంవత్సరంలో కూడా బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహించింది. తక్కువ ఎత్తులో వంతెన ఉండటంతో పాటు బ్రిడ్జి పైన గోతులు పడి పిల్లర్లు నెర్రెలు బారి వంతెన అధ్వాన్నస్థితిలో ఉంది.

నూతన బ్రిడ్జి నిర్మించాలి

నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో ఒకటే రహదారి కావడంతో పొరపాటున ఏదైనా బ్రిడ్జికి ప్రమాదం జరిగితే గిద్దలూరు – కలసపాడు మార్గంలో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుంది. గత ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారే తప్ప.. వంతెన నిర్మాణానికి కార్యరూపం దాల్చలేదు. ఆర్ అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి సగిలేరుపై నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి



వంతెన దెబ్బతినడంతో అవస్థలు పడుతున్నాం. సగిలేరు నదిపై కూటమి ప్రభుత్వం తక్షణమే వంతెన నిర్మాణం చేపట్టాలి. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. పిల్లర్లు దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని భయంగా ఉంది.

–బోడెద్దులబాలఅంకిరెడ్డి, ఎగువ రామాపురం, కలసపాడు మండలం

ఇబ్బందులు పడుతున్నాం



సగిలేరు బ్రిడ్జిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నాం. భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు బ్రిడ్జిపై శబ్దాలు వస్తున్నాయి. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరుతున్నాం.

–జెట్టిబోయిన సింగరయ్య, దిగువ తంబళ్లపల్లె, కలసపాడు మండలం

చంద్రబాబు నిర్వాకం.. ప్రజలకు భారం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలకు హామీ చేసిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో రెండు సార్లు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేస్తూ మోసాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ. 15,485.36 కోట్లు విద్యుత్ భారం మోపిందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు, ట్రూ అప్‌ల పేరుతో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మొదలు పెట్టారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్కు నయవంచనతో హామీలకు తూట్లు పొడుస్తూ ప్రజలను దెబ్బతీశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యూనిట్ రూ. 2.49 పైసలకు కొనుగోలు చేస్తే, చంద్రబాబు యూనిట్ రూ. 4.84కు కొనుగోలు చేయడం వలన యూనిట్‌కు అదనంగా రూ. 2.35పైసలు భారం పడిందని పేర్కొన్నారు. బాబు నిర్వాకం వలన ఏటా రూ. 1,500 కోట్ల భారం పడుతోందని తెలిపారు. డిస్కంలను అప్పుల్లోకి నెట్టిన ఘనత చంద్రబాబుదేనని మండిపడ్డారు.

పంట నమోదు తప్పనిసరి



గోపవరం: రాచాయపేటలో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



బి.కోడూరు : వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

గోపవరం : రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య పేర్కొన్నారు. సోమవారం రాచాయపేట రైతుసేవా కేంద్రం పరిధిలో సాగుచేసిన వరిపంటకు సంబంధించి సంబంధిత రైతులతో పంట నమోదు చేయించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున పంటలకు సంబంధించిన బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలు పంట నమోదుపై ఆధారపడి ఉంటుందన్నారు. వరిపంటలో కాలిబాటలు తీసుకుని అక్కడక్కడ లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని ద్వారా పంటలకు వ్యాపించే తెగుళ్లను రైతులు ముందుగానే పసిగట్టవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వ్యవసాయ సలహాలు, సూచనల కోసం అందుబాటులో ఉన్న రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధ, జ్యోతి, సుమతి, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి

అట్లూరు: రైతులు పంటల బీమా చేయించుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ సూచించారు. బద్వేలుతో పాటు అట్లూరు, గోపవరం, సిద్దవటం మండలాల పరిధిలో ప్రస్తుత రబీ సీజన్‌లో వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు, మినుము, వేరుశనగ సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు సాగు చేసిన పంటలపై బీమా చేయించు కోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలో గానీ పోస్టాఫీస్‌లో గానీ పంటల బీమా ప్రిమియం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సంభందించిన రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. అనంతరం బద్వేలు మండల పరిధిలోని రైతులకు పంటల బీమాపై అవగాహన కలిగించారు.

వరిపంట పరిశీలన

బి.కోడూరు : మండలంలోని మరాటిపల్లె గ్రామంలో సోమవారం రైతులు సాగు చేసిన వరి పంటను మండల వ్యవసాయాధికారి టి.కౌశిక పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫెంగల్ తుపానుకు పంటలు దెబ్బతినకుండా రైతులు తగిన సూచనలు పాటించాలన్నారు. కంది పొలంలో మురుగునీటిని వీలైనంత త్వరగా బయటికి పంపించాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత మారుకాకాయా తొలిచే పురుగును నివారించడానికి క్లోరోఫైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా నో వాల్యూరాన్ వన్ ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మినప పెసర పంటలో ఇనుత దాత లోపం గుర్తించినప్పుడు లీటరు నీటికి 5 గ్రాములు అన్నభేరి, 0.5 గ్రాములు నిమ్మఉప్పు కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. శనగ పంటలో పంట నీట మునిగినప్పుడు మురుగు నీరు తీసివేసి హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన బ్యాక్టీరియా, ఎండు తెగులు, వడ తెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

పోరుమామిళ్ల: రంగసముద్రం పంచాయతీ పరిధిలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, గురయ్య మాట్లాడుతూ పేదలు ఇల్లు లేక బాడుగ ఇండ్లల్లో నివాస ముంటూ నెలనెలా బాడుగలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. రంగసముద్రం రెవెన్యూ పొలంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నా పేద వాడికి 3 సెంట్లు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. దరఖాస్తులు విచారించి అర్హులైన వారందరికీ ఇంటిస్థలాలు ఇవ్వాలని డిమాండ్ కోరారు. రాజకీయ పలుకుబడి కలిగిన వారు వందల ఎకరాలు ఆక్రమించుకున్నారని, ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో మరమ్మతులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్యమయ్య, ఆరోగ్యం, విజయమ్మ పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

కాశినాయన : ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. సోమవారం మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పర్యటించి వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్యం చేసి మందులు అందజేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, శివశంకర్ రెడ్డి, సీహెచ్‌ఓ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ బాలయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

పోరుమామిళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. సోమవారం పోరుమామిళ్ల జిల్లా ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీయం సన్నద్ధత సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అబ్బు సుభాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఖాదర్ హుస్సేన్ మసీదు వీధిలోని జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో సోమవారం భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎం అబ్బు సుభాన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, దీనిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగం గురించి పలు విషయాలను వివరించారు. ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాన హక్కులు రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, నజీర్, అస్లాం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పంటకు చీరే రక్షణ



రాజుపాళెం-తొండలదిన్నె రహదారిలో మొక్కజొన్న పొలం చుట్టూ చీరలు కట్టిన రైతు



శనగ పొలం చుట్టూ పందులు రాకుండా చీరలు కట్టిన రైతు

ఈ చిత్రాలు చూస్తున్నారా.. ఇదేంటి ఇలా పంటలకు చీరలను కట్టారని అనుకుంటున్నారా..? ఈ చీరలు ఏ ప్రదర్శనకో కట్టారనుకుంటే పొరపాటే. పంటలను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు ఇలా చీరలు కట్టారు. మండలంలోని టంగుటూరు, రాజుపాళెం, గాదెగూడూరు, తొండలదిన్నె తదితర గ్రామాల్లో మొక్కజొన్న, శనగ పంటలను పందులు నాశనం చేస్తాయోనని రైతులు ముందస్తుగా రంగు రంగుల చీరలు పొలం చుట్టూ కట్టి పంటను రక్షించుకుంటున్నారు. పంటను కాపాడుకునేందుకు అన్నదాత పడరాని పాట్లు పడుతున్నారు.

– రాజుపాళెం

పన్ను వసూలుపై దృష్టి సారించాలి



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్, మహబూబ్‌నగర్, పూసలవాడ సచివాలయాల పరిధిలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి పన్ను బకాయిలు పేరుకుపోయిన యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.61 కోట్లు పన్నులు బకాయి ఉన్నాయని సంబంధిత కార్యాలయాలకు నోటీసులు అందజేశామని తెలిపారు. అలాగే పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వంద మంది బకాయిదారుల నుంచి రూ.85 లక్షలు రావాల్సి ఉండగా మొదటి విడత నోటీసులకు కొంత మంది స్పందించి బకాయిలు చెల్లించారని, మిగిలిన వారికి కూడా రెండవ విడత నోటీసులు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం పూసలవాడ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ షఫి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

వివిధ రకాల పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి, సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు సచివాలయాలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో లేకుండా సకాలంలో అందజేయాలని కోరారు.

సీమ అభివృద్ధిని విస్మరిస్తున్న 'కూటమి'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : రాయలసీమ అభివృద్ధిని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం పట్టణ మహాసభలలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోకాయుక్త, కొప్పర్తి డెవలప్‌మెంట్ సెంటర్, ఆంధ్ర గ్రామీణ బ్యాంకు, మెడికల్ కాలేజీ సీట్లు లాంటివి అమరావతికి తరలించుకుపోయారని తెలిపారు. తీవ్ర కరువు ప్రాంతమైన రాయలసీమలోని తెలుగుగంగ, గాలేరు–నగరి, హంద్రినీవా, వెలుగొండ, సర్వరాయసాగర్ పంట కాలువల పూర్తికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టులో రాయలసీమలో పెట్టాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. అలాగే జిల్లాలో 28 మండలాలు కరువుతో అల్లాడుతుంటే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదని, ఇది జిల్లాపై వివక్షేనని అన్నారు. మహాసభల సందర్భంగా తొలుత పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, శివకుమార్, పట్టణ కార్యదర్శి శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, నాగేంద్రబాబు, మోక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవం .. ప్రతిష్టా మహోత్సవం



బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జి కొర్నేలియస్‌ను ఊరేగిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు చర్చి 137వ ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి చర్చి ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. బ్రిటిష్ హయాంలో నిర్మించిన చర్చి వేడుకలను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. చర్చి లోపల క్రీస్తు శిలువకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జి కొర్నేలియస్‌ను కలసపాడు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మేళతాళాలతో చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. చర్చి డీనరీ చైర్మన్ ఆనందకుమార్, ప్రెస్బేటర్ ఆసిస్‌గాబ్రియేల్ తదితరులు బిషప్‌కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్చి కమిటీ అన్ని వసతులు కల్పించారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ చిరంజీవి బందోబస్తు నిర్వహించారు.

కంపచెట్లను తొలగించండి సారూ!



కూలూరు- కొట్టాల నుంచి చాగలమర్రికి వెళ్లే రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

రాజుపాళెం : మండలంలోని కూలూరు–కొట్టాల గ్రామాల మధ్యలో కుందూనదిపై నంద్యాల జిల్లా చాగలమర్రికి వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఆ దారిలో ప్రతినిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. సింగిల్ రహదారి కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటప్పుడు ఇబ్బందులు పడుతున్నామని వారు చెబుతున్నారు. ఈ విషయాన్ని గతంలో సంబంధితశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాహనదారులు, గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు కిరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ గంగయ్యకు పేద మహిళలు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాపక్షం పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తారని, పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేయాలని, వారి ఆధార్ నంబర్‌ను, జాతీయ చెల్లింపుల కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లింక్ చేయాలని సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందన్నారు. దీంతో కొందరు దళారులు మహిళల నుంచి డబ్బు వసూలు చేసి మోసం చేస్తున్నారని తెలిపారు. దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ ప్రధాన కార్యదర్శి మునిసుబ్బారెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కరీం, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై చక్కర్లు ..ప్రమాదాలకు సంకేతాలు

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు జైలుకు వెళ్లారని చెబుతున్నా.. బాలలు వాహనాలు నడపరాదని ఓ వైపు జిల్లా ఎస్పీ సూచనలిస్తున్నా జనంలో మార్పు రాలేదు. విద్యార్థులు త్రిబుల్ రైడింగ్ చూస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఖాజీపేటలో మైనర్లు నిత్యం బైక్‌లను నడుపుతూ చక్కర్లు కొడుతున్నారు. పోలీసులు చూస్తూ ఉన్నారే తప్ప పట్టించుకోవడం లేదు. విద్యార్థులు ప్రమాదకర డ్రైవింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఖాజీపేట



బైక్‌పై వెళుతున్న బాలుడు



త్రిబుల్ రైడింగ్ చేస్తున్న విద్యార్థులు



డబుల్ రైడింగ్ చేస్తున్న విద్యార్థులు